# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## తడిసిపోతే ఎంతబావుంటుందీ..!

చెప్పా చెయ్యకుండా ఇంటికి అతిథులొస్తే ఆడవాళ్ళకి ఎంత ఇబ్బందీ? ఎంత కంగారూ? అదిగో అచ్చు అలాగే దడ దడమని ముందు రేకుల మీద మొదలయి ఆ తర్వాత తెలుస్తుందీ వాన!

ఆండాళమ్మగారు పక్కింటావిడతో గోడమీద నుండి కబుర్లు చెప్పడం మానేసి పడుతూ లేస్తూ డాబా మీద ఆరేసిన బట్టలు తియ్యడానికి పరిగెడుతుంది!

పరంధామయ్యగారు అరుగు మీదున్న తన పడక కుర్చీ, నవారు మంచం లోపలకి లాక్కోడానికి అవస్థ పడుతుంటారు.

రోడ్ల మీద గొడుగుపూలు విచ్చుకుంటాయి. తారు రోడ్లని సునాయాసంగా కడిగి.. ఇదిగో.. పొద్దంతా మీరు నింపిన కల్మషం అని మనకి చూపిస్తుంటుంది. త్వరగా ఇళ్ళకి చేరాలని బయలుదేరిన ద్విచక్రవాహనదారులు దారులన్నీ జలమయంబై తలదాచుకోను చోటులేక అల్లల్లాడిపోతారు.

రోడ్లకి అటూ ఇటూ ఉన్న వ్యాపారస్తులు పండ్లూ, కూరగాయలూ, పూలూ అమ్మేవాళ్ళకి ఫరవాలేదు! కాస్త నెమ్మదిగా టార్పాలిన్ బట్టలు కప్పుతుంటారు.

కానీ పాపం.. బట్టలూ, సుద్దబొమ్మలూ, నీరు పడగానే రంగు వెలిసిపోయే ప్లాస్టిక్ సామాన్లు అమ్మే చిల్లర వ్యాపారస్తులు... తిట్టుకుంటూ, సామాన్లు ఎత్తుకుని పరిగెడుతుంటారు.

బస్సులో కానీ కార్లో కానీ వెళ్ళేటప్పుడు రోడ్డుకి అటూ ఇటూ చూస్తే మనకి వీళ్ళు కనిపిస్తుంటారు. పొద్దంతా క్షణం తీరిక లేకుండా మట్టి పిసికి అచ్చుల్లో పోసి బొమ్మలు చేసే వాళ్ళూ, పేము కుర్చీలు అల్లేవాళ్ళూ, జూబ్లీ హిల్స్ చెక్ పోస్ట్ దగ్గర కరెంట్ బాట్స్ దోమల్ని చంపుకోడానికి అమ్మేవాళ్ళూ, పెద్ద పెద్ద విమానం బొమ్మలూ, బర్తడేలకి నెత్తి మీద పెట్టుకునే విచిత్ర టోపీలు అమ్మేవాళ్ళు వీళ్ళంతా ఎవరో తెలుసా?.. మన దేశం ఎకానమీకి దోహద పడేవాళ్ళు. మన నేషనల్ ఇన్కం పెంచేవాళ్ళు! నాకు వీళ్ళంటే గొప్ప గౌరవం. ఎందుకంటే.. వీళ్ళు బద్దకస్తులు కారు. నాకు ఎప్పుడూ ఖాళీగా కనిపించలేదు. పిల్లల్ని చంకనేసుకుని రోడ్లకి అడ్డంపడి వాళ్ళ ప్రాడక్ట్స్‌ని అమ్మాలని పరిగెడుతుంటారు. ముప్ఫైరూపాయల వస్తువుని మనం కారు విండోలోంచి కాలక్షేపానికి మూడు రూపాయలకి అడిగితే తిట్టరు. అదే హైదరాబాద్ సెంట్రల్‌లో వెయ్యి రూపాయిల వస్తువులని తొమ్మిది వందల తొంభై తొమ్మిదికి అడిగి చూడండి "నో.. సర్.. సారీ!" అని నీ జన్మ చాలదు ఇంత ఖరీదైనది కొనడానికి అన్నట్లు మన వైపు ఓ చూపు చూస్తారు!

వీళ్ళ పిల్లలు పుట్టినప్పటినుండీ వంటిమీద గుడ్డముక్క లేక గాలికీ, ధూళికీ, వానకీ, ఎండకీ పెరుగుతుంటారు. వీళ్ళు మన పిల్లల 'హ్యాపీ బర్త్‌డే'లకి కేప్స్, కేండిల్స్ తయారు చేసి కారు దగ్గరకొచ్చి కొనమని ప్రాధేయపడుతుంటారు.

వీళ్ళ పిల్లలు విమానం కాదు బస్సు కూడా ఎక్కలేరు. వీళ్ళు మన పిల్లల కోసం విమానం బొమ్మలు.. నిజం విమానంలాగే.. ఎంత శ్రద్ధగా గమనిస్తారో కానీ, కరెక్ట్‌గా అలాంటివే తయారు చేసి అమ్మచూస్తే మనం అడుక్కునే వాళ్ళని చూసినట్లు చూస్తాం.. ఆ బొమ్మ తయారయ్యేసరికి ఎంత శ్రద్ధా, ఎంత ఏకాగ్రతా కనబరచి ఉంటారో అని ఆలోచించం.

మన పిల్లలు బూస్ట్‌లు తాగి బయట క్రికెట్ ఆడుకుంటుంటే పనికి రావడానికి వికెట్లూ, బాట్లూ తయారు చేసే వాడి పిల్లలు ఒక్కసారీ వాటితో ఆడాలనుకోరు. వీళ్ళు వానొస్తే హడావిడి పడరు. వానని తిట్టుకోరు. ఎందుకంటే వానలో హడావిడీగా చేరుకోవడానికి వీళ్ళకి ఇళ్ళుండవుగా. పైగా స్కూటర్ వాళ్ళూ, నడిచే మనుషులూ కాసేపు బస్ స్టాపుల్లో ఆగుతారు. వీళ్ళకి పది రూపాయిలు లాభం రావచ్చు!

కార్ల మీద పడిన వర్షాన్ని తుడవడానికి ఓ ఆరేళ్ళ పిల్లా, ఎనిమిదేళ్ళ పిల్లాడూ ఎక్కడినుండో ఓ బట్ట పీలికతో సడెన్‌గా ప్రత్యక్షం అయి, చెయ్యి జాపుతుంటారు. మనం వేసే రూపాయి చూసి వాళ్ళ కళ్ళు మెరుస్తుంటాయి!

సాధారణంగా మనలో చాలామంది వేమనలుంటారు... సమాజంలో కుళ్ళూ, రొచ్చూలాంటివి అన్నీ మేం విప్పి చెప్పగలం అనే ధీమాతో బస్ స్టాపుల్లో పక్క వాళ్ళతో మాట్లాడేస్తుంటారు... "వీళ్ళకి చచ్చినా పైసా ఇవ్వకూడదండీ.. వీళ్ళల్లో లక్షాధికారులూ, కోటీశ్వరులుంటారు.. మొన్న ఓ బిచ్చగాడు పోతే.. వీడి దగ్గర ముప్పై ఆరు లక్షలు దొరికిందట.. వీళ్ళు పోలీసులకి వడ్డీలకి డబ్బులిస్తారట! " ఇలాంటివి!

డబ్బు విలువ తెలిసిన ఆ శ్రామికులు నిజంగానే డబ్బులుంటే పబ్బులకీ, సినిమాలకీ ఖర్చుపెట్టకపోవచ్చు. కానీ నడిచే అస్తిపంజరాల్లా, ఎముకలు బయటపడి, వాన నీటికి తప్ప వంటి మీద మలినం కడుక్కోలేని స్థితిలో, కడుపున పుట్టిన వాళ్ళకి కడుపులు నింపలేని స్థితిలో ఎందుకుంటారు? ఈ ఆలోచన లేక కాదు బస్ స్టాపుల్లో గాలి కబుర్లు.. పక్కవాడు విస్తుబోయి నోరు తెరిచి వింటే మనకదో శాటిస్ ఫాక్షన్! అందుకే వాటిని గాలి కబుర్లు అన్నారు.

గమనించండి.. ఈ రోడ్డు పక్కన పనిచేస్తున్న వాళ్ళెవరూ గాలి కబుర్లు చెపుతూ కనిపించరు. పని చేస్తూ కనిపిస్తారు. మన ఇళ్ళ ముఖద్వారాలకి కట్టుకునే పూసల, చమ్కీల తోరణాలూ, మన పిల్లలకి దోమలు కుట్టకుండా దోమతెర గొడుగులూ మనీ పర్సులూ, హేండ్ బ్యాగులు.. ఒకవేళ సరదాపడి కొన్నా.. వాళ్ళ వేళ్ళు తగలకుండా డబ్బులిస్తాం. ఆ వేళ్ళ పనితనాన్ని ఒక్కసారీ ప్రశంసించం. అదే ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో అర్థంకాని ఆర్ట్‌ని అర్థం చేసుకోడానికీ, స్వంతం చేసుకోవడానికీ కోటీశ్వరులు తల బద్దలు కొట్టుకుంటుంటారట.

"రేపు", ఇది మన ప్రతిపనినీ వాయిదా వెయ్యడానికి పనికొచ్చే తియ్యని వరం! బద్ధకస్తులకి రోజూ 'రేపే'! ఈ రోజు ఉండదు. నిద్రమంచం మీద నుండే ఈ రోజు పనులన్నీ రేపు చేద్దాం అని సిద్ధమై లేస్తారు. మా సినిమా ఇండస్ట్రీలో చాలా మంది ఇలాంటివాళ్ళుంటారు. పని దొరికే వరకూ పొద్దున్న రాత్రీ ప్రొడ్యూసర్, డైరెక్టర్ల ఇళ్ళ చుట్టూ తిరుగుతారు.. పని ఇచ్చాకా ఏం అడిగినా జవాబు 'రేపే'! అసలు అడ్వాన్స్ తీసుకున్నాక ఫోన్ తియ్యడానికీ, వాళ్ళ కళ్ళకి కనబడడానికీ వాళ్ళకి విసుగు!

కానీ.. వీళ్ళకి 'రేపు' ఉండదు. ప్రతి నిమిషం.. 'ఈ నిమిషం' ఎల్ క్యాష్ చేసుకోవాలా అన్న ఆలోచనే ఉంటుంది. 'లివ్ ఇన్ ద మొమెంట్' అనడానికి ఉదాహరణ వీళ్ళు! బాగా డబ్బు ఎక్కువై పబ్‌లకీ క్లబ్ లకీ వెళ్ళి 'రెయిన్ డాన్స్' చేసే వాళ్ళకి నిజంగా ఈ వర్షంలో తడిస్తే ఎలా ఉంటుందో తెలిస్తే.. ఈ ఆనందానికి అది సాటి రాదని తెలుసుకుంటారు!

సాయంకాలం స్కూలు వదిలాకా, బడినుండి ఇంటికి వెళ్ళే దారిలో వర్షం రావాలని చిన్నప్పుడు కోరుకునేవాళ్ళం. ఎందుకంటే, ఇంటికెళితే పెద్దాళ్ళు తడవనియ్యరు కాబట్టి.

చెట్టుకింద నిలబడితే, వర్షం బయట తగ్గినా మనకి తెలీదు. ఎందుకంటే చెట్టు తన ప్రతి ఆకూ కడుక్కుంటూ ఆ నీళ్ళన్నీ మన నెత్తి మీద అక్షింతలుగా కురిపిస్తుంటుంది! బట్టలన్నీ వంటికి అతుక్కుపోయి, కళ్ళమీదా, నోట్లో డైరెక్ట్‌గా వర్షం నీళ్ళు పడుతూ.. గబగబా మనం ఏ మేథ్స్ క్లాస్ వర్కో తీసి 'షర్న' ఓ పేజీ చింపి ఆ నీళ్ళల్లో వేస్తే... అది 'టైం ఎండ్ వర్క్!, లేకపోతే 'ఆల్జీబ్రా' లెక్కల్ని మోసుకుంటూ 'స్ర్న' నీళ్ళల్లో పోతుంటే, పక్కవాడి 'కత్తిపడవని' మన పడవ బొక్క బోర్లా వేసి మరీ మన విజయకేతనాన్ని ఎగురవేస్తే.. ఎంత బాగుండేదీ?

ఇంట్లో అడుగుపెడుతుంటే.. "మళ్ళీ తడిసొచ్చావా? ఇలారా మీ అమ్మ చూస్తే కోప్పడుతుంది" అని బామ్మ తల తుడిచి, సాంబ్రాణి పొగ వేసి, వేడీ వేడి పకోడీలు పెడితే...

'తూ..చ్..తూ..చ్' అని తుమ్ముతుంటే అమ్మ గుండెలకి - విక్స్ రాసి "రేపు బడికి వెళ్ళద్దులే!" అని రగ్గు కప్పి పడుకోపెడితే...

నాన్నగారు సడెన్ గా "ఈ రోజు అందరం క్రికెట్ మ్యాచ్ చూద్దాం.. నేనూ ఆఫీస్‌కి వెళ్ళడం లేదు" అని డిక్లేర్ చేస్తే....

మా లలితలాంటి స్నేహితురాలు ఫోన్ చేసి "మణినీ, సుశీలనీ తీసుకుని వచ్చేసెయ్ రమణీ... మన కల్పన ఆల్‌రెడీ వచ్చేసింది.. కుంపటి వెలిగించాను. మొక్క జొన్న పొత్తులు కాలుస్తున్నాను.." అని చెపితే..

ఆఫీసులనుండీ, చేస్తున్న పనులనుండీ అమాంతం శలవు ప్రకటించి మేమంతా కబుర్ల భోజనానికి లలిత ఇంటి ముందు ప్రత్యక్షమైతే...

మేఘుడు, మేఘమాలికతో ముత్యాల తలంబ్రాలు పోసుకుంటున్నట్లు జల జలమని గుండ్రటి వజ్రం తునకల్లాంటి వడగళ్ళు వసారాలోంచి ఇళ్ళల్లో పడూతుంటే.. కిటికీ తలుపులు ఒకంతట ఆగక గాలికి వెనక్కొస్తుంటే, మొహం నిండా వాన తుంపర్లు పడుతుంటే, ఎంతో నవ్వొస్తుంది.!! ఎందుకంటే .. అది గుండెల్లో ఎప్పటినుండో గూడు కట్టుకుపోయిన సంతోషం! ఆ సంతోష ప్రసూనం ఇప్పుడు రేకు విచ్చి నవ్వై.. పువ్వై విరిసి ఎందుకో కారణం లేకుండానే పక్కింటి వాళ్ళని చూసి నవ్వుతాం... వాళ్ళూ నవ్వుతారు! రోడ్డు మీద వెళుతూ, వానకి మన వరండాలో నిలబడిన అపరిచితుడూ నవ్వుతాడు! ఈ వానలో తనకొచ్చే గిరాకీని తలుచుకుని మొక్క జొన్న పొత్తులు అమ్మే అమ్మాయీ నవ్వుతుంది!

వానకి గొడుగు తిరగేసి విప్పుకుంటుంటే తంటాలు పడుతున్న ఆంటీ నవ్వుతుంది.... ఎప్పటి నుండో పాటలో రాని పదం.. హఠాత్తుగా కిటికీలోంచి ఊడిపడితే 'కాయితాన్ని' నలుపు చేసే కవీ నవ్వుతాడు.

ఆ వర్షపు చుక్కల 'టపటప'కి కదిలి సిగరెట్ పెట్టె మీద తాళం వేస్తూ ఓ రాగాన్ని గాలిలోంచి పట్టుకున్న సంగీతకారుడూ నవ్వుతాడు.

ఎంతో ప్రేమని అనంతమైన జలనిధితో పోల్చుకోతగ్గదాన్ని చిన్న పదాలలో ఎలా చెప్పాలా అని మధన పడుతున్న ప్రేమికుడూ... వానలో తడిసిన ప్రియురాలిని చూసి ఓ నవ్వు నవ్వి, తన ప్రేమని ఆమె నడిచే దారిలో బురద తగలకుండా రెండు ఇటుక రాళ్ళుగా వేసి.. ధైర్యంగా తెలియబరచగలడు. ఆమె కృతజ్ఞతగా.. ప్రేమగా చూస్తుంది!

పెళ్ళయి, మూడునిద్రలయినా, భర్తతో పగలు మాట్లాడ్డానికి ఇంకా సిగ్గు తొలగని కొత్త పెళ్ళికూతురు, డాబామీద బట్టలు తియ్యడానికి వెళ్ళి, ఆ పని మరిచిపోయి, ఆకాశం వైపు చూసి, రెండు చేతులూ జాపి, నోరు తెరిచి నిలువెల్లా తడిసిపోతుంటే, వెనకనుండొచ్చి ఆమె చెంపకి చెంప చేర్చి, వాటేసుకున్న మొగుడ్ని "దొంగా" అని చనువుగా చెంపమీద ఒకటిచ్చి అల్లుకుపోగలదు!

వారానికోసారి ఇల్లు కడుక్కుంటాం, రెండుసార్లు కారు కడుక్కుంటాం. కానీ ఇలా ప్రతి ఇల్లూ, ప్రతి చెట్టూ, ప్రతి రోడ్డూ, రోడ్డు మధ్యలోని ప్రతిదేశనాయకుడినీ కడగగలమా? అది వానకే చెల్లింది!

రోజుకోసారి ఒళ్ళుకడుక్కుంటారు.. వీలైతే రెండు మూడుసార్లు మొహం కడుక్కుంటారు.. కానీ మనసు కడుక్కోగలమా?.. అదీ వానొచ్చినప్పుడూ ఒక్క రోజుకి ఇంట్లో ఉండి ప్రశాంతంగా ఆకాశం వైపు చూస్తూ చెయ్యగలిగిన పని!

రోడ్డు కనపడని ఎగుడు దిగుళ్ళలో, ఎక్కడ మాన్ హోల్స్ రాక్షసుడిలా నోళ్ళు తెరుచుకుని ఉన్నాయో తెలీని స్థితిలో .. కళ్ళని వర్షపు చుక్కలు తెరవనివ్వకుండా కొడుతున్న తరుణంలో.. దయచేసి కాసేపు ఆగండి...

తడిసిపోతే ఎంతో బాగుంటుంది!

కానీ ఇంటికి క్షేమంగా చేరితే మీ ఇంటిల్లపాదికీ బాగుంటుంది!

చిన్నప్పుడు రెయిన్ కోట్ తీసుకెళ్ళిన రోజు వర్షం వచ్చేది కాదు.. తీసుకెళ్ళని రోజున అమాంతం దారికాసి కొట్టేది! దొంగవాన! జీవితం అంతే.. ఏదీ ఊహించి అడుగులెయ్యకండి .. థ్రిల్ పోతుంది!

**సర్వేజనా సుఖినోభవంతు.**